భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

8, అక్టోబర్ 2026, గురువారం భారత్ సమాచార్

24న స్వర్ణకారుల సమస్యలపై శంఖారావం మహాసభ



భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా: స్వర్ణకారుల సమస్యలు, హక్కుల సాధన కోసం ఈ నెల 24న సరూర్‌నగర్ స్టేడియంలో స్వర్ణకార శంఖారావం మహాసభ నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు తెలిపారు. ఈ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను అక్టోబర్ 9న శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మహబూబాబాద్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆవిష్కరించారు.

తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, రాష్ట్ర కోశాధికారి గొట్టిముక్కుల చంద్రశేఖర్, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోజు కృపాకరాచారి కలిసి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

నాలుగు ప్రధాన డిమాండ్లతో మహాసభ

ఈ సందర్భంగా మహబూబాబాద్ జిల్లా స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోజు కృపాకరాచారి మాట్లాడుతూ.. స్వర్ణకారుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్వర్యంలో నాలుగు ప్రధాన డిమాండ్లతో స్వర్ణకార శంఖారావం మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వర్ణకారుల ప్రధాన డిమాండ్లు:

1. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు: స్వర్ణకారుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

2. GO MS నంబర్ 272 సవరణ: GO MS నంబర్ 272ను సవరించి అమలు చేయడంతో పాటు స్వర్ణకారులపై నమోదవుతున్న అక్రమ కేసులను అరికట్టాలని కోరారు.

3. రూ.5 వేల పెన్షన్: 50 సంవత్సరాలు నిండిన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు రూ.5,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు.

4. బ్యాంకుల్లో సీలింగ్ విధానం తొలగింపు: అప్రైజర్లు పనిచేస్తున్న అన్ని బ్యాంకుల్లో సీలింగ్ విధానాన్ని తొలగించి, సమాంతరమైన కమిషన్ విధానం అమలు చేయాలని కోరారు.

భారీగా పాల్గొనాలని పిలుపు

స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న స్వర్ణకార శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని ఎర్రోజు కృపాకరాచారి కోరారు. ఈ కార్యక్రమానికి

మహబూబాబాద్ జిల్లాకు చెందిన స్వర్ణకారులు అధిక సంఖ్యలో హాజరై మహాసభను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు.

© 2026 Bharath Samachar